

రత్నానగర్‌లో పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకుంటున్న కిషన్‌రెడ్డి

ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాళ్ల ఆధునికీకరణ

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లకుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎంపీ నిధులతో నల్లకుంట డివిజన్ రత్నానగర్, సత్యానగర్ కమ్యూనిటీహాళ్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ రెండు కమ్యూనిటీహాళ్ల మొదటి అంతస్తుల నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. శుక్రవారం కమ్యూనిటీహాళ్ల ఆధునికీకరణ పనులను కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఆయన పరిశీలించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

సార్వత్రిక సమ్మెకు ఐఎన్‌టీయూసీ మద్దతు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఐఎన్‌టీయూసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం నారాయణగూడలో ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కార్మిక సంఘాలు సమ్మెలో భాగస్వామ్యమై మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పలు సంఘాల నాయకులు ఎస్.నర్సింహారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్, రామావత్ శంకర్‌లాల్, ఎం.రాజేందర్‌రెడ్డి, ఎస్.దయానంద్, బి.రామకృష్ణారెడ్డి, మల్లేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరాహారదీక్ష విరమణ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫీవర్ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం విధులు బహిష్కరించి నిరవధిక నిరాహార దీక్షకు దిగడంతో యాజమాన్యం దిగివచ్చింది. నెల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. దీంతో ఉద్యోగులు తాత్కాలికంగా సమ్మెను విరమించారు. మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని మూడు రోజుల నుంచి ధర్నా చేస్తున్న విషయం విదితమే. ఆస్పత్రి యాజమాన్యం కాంట్రాక్టర్లు సాహితీ, నక్షత్ర యాజమాన్యాలను పిలిపించి వారితో చర్చలు జరిపారు. నెల వేతనం సోమవారం లోపు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, ఫీవర్ ఆస్పత్రి యూనిట్ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు.

హైదరాబాద్ స్టేట్ పార్టీ ఆవిర్భావం

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా సాధించడమే లక్ష్యంగా హైదరాబాద్ స్టేట్ పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండు అంజయ్య నేతాజీ తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ ఆవిర్భావ సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తెలుగు ప్రజలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు స్థిరపడ్డారని, అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన హైదరాబాద్‌ను దేశ రెండో రాజధాని చేయడం శ్రేయస్కరమన్నారు. ఈ లక్ష్య సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా సీతారామయ్య విద్యాసంస్థల అధినేత ద్రాక్షాయిణిని జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. దళితసేన నాయకులు జేబీ రాజు, రచయిత బిక్కి కృష్ణ, హైదరాబాద్ స్టేట్ పార్టీ నాయకులు లింగమూర్తి, బూక్య శంకర్‌నాయక్, అమిత నేతాజీ, బీవీ నాయక్, కల్యాణ్‌నాయక్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో స్వామి వివేకానంద జన్మతిథి వేడుకలు



వేడుకల్లో బోదమయానంద స్వామి, భక్తులు

కవాడిగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ మఠంలో శుక్రవారం స్వామి వివేకానంద 162వ జన్మతిథి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మఠంలోని రామకృష్ణుల విశ్వజనీన దేవాలయంలో తెల్లవారు జామున 5.30 నుంచి రాత్రి 7.15 గంటల వరకు భజనలు, పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ వర్కర్లను సన్మానించారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు బోదమయానందస్వామి వివేకానంద జీవితంపై సందేశమిచ్చారు. ఆయన ఆశయ సాధనకు యువత పాటుపడాలని పిలుపునిచ్చారు.

బస్తీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : కార్పొరేటర్ పావని



వీవీ గిరినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో బస్తీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ పేర్కొన్నారు. వీవీ గిరినగర్ బస్తీలో అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. నల్లాల ద్వారా కలుషిత నీటి సరఫరా, సివరేజీ సమస్యల పరిష్కారానికి కొత్త పైపులైన్, షాబాద్ బండల ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పైపులైన్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు

కుష్టు వ్యాధిపై అవగాహన

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నివారణకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. శుక్రవారం ఆర్ఎఫ్‌పీటీసీ కోఠి ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ఈనెల 13 వరకు డివిజన్‌లో అన్ని బస్తీల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు జానాబాబు, పద్మావతి, మనోజ్‌రెడ్డి, లలిత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'జీవో 6 రద్దు చేయాలి'

కవాడిగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జీవో 6 రద్దు చేసి గంగపుత్రులకు న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, నాయకులు ఆర్కే భగవాన్, అంబటి సుధాకర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. గంగపుత్రుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు చెప్పారు.

శంకుస్థాపన చేసి 13 ఏళ్లు

● నేటికీ ప్రారంభం కాని లింక్ బ్రిడ్జి పనులు

● గోల్నాకలో ట్రాఫిక్‌తో వాహనదారులు, స్థానికుల ఇబ్బంది



గోల్నాక చౌరస్తాలో ట్రాఫిక్ (ఫైల్)



శంకుస్థాపన చేసిన శిలాఫలకం

గోల్నాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శంకుస్థాపన చేసి 13 ఏళ్లయినా లింక్ బ్రిడ్జి నిర్మాణ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. గోల్నాక చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో గోల్నాక కొత్త బ్రిడ్జి నుండి కృష్ణానగర్ వరకు లింక్ బ్రిడ్జి నిర్మించాలని జీహెచ్ఎంసీ రూ. 5.75 కోట్లు మంజూరు చేసింది. 2011, ఆగస్టు 21న అప్పటి ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనేక అవరోధాలు ఏర్పడడంతో పనులు ప్రారంభం కాలేదు. కృష్ణానగర్‌లో పలువురి పేదల ఇళ్లు తొలగించాల్సి రావడం, వారు వ్యతిరేకించడంతో సమస్య మొదలైంది. జీహెచ్ఎంసీ అధికారులు స్థానికులతో మాట్లాడి సమస్య పరిష్కరించి పనులు ప్రారంభించడానికి చొరవ తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దిల్‌సుఖ్ నగర్, మలక్‌పేట, అంబర్‌పేట అలీకేఫ్‌చౌరస్తా నుంచి చాదర్‌ఘాట్, కోఠి వెళ్లే వాహనాలకు ఇబ్బంది ఉండదని, గోల్నాక చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందనుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రస్తుతం అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం, మరోవైపు మూసారాంబాగ్ మూసీనదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో వాహనాలు గోల్నాక నుంచి వెళ్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

సమస్య పరిష్కారానికి చర్యలు



సమస్య పరిష్కరించి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్లు కోల్పోతున్న పేదలకు న్యాయం చేసేందుకు అధికారులతో మాట్లాడుతున్నాం.

- కాలేరు వెంకటేష్, ఎమ్మెల్యే

విద్యుత్ దహన వాటిక సమీపం నుంచి నిర్మించాలి



అంబర్‌పేట విద్యుత్ దహన వాటిక సమీపం నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఎలాంటి సమస్య ఉండదు. గోల్నాక కొత్త బ్రిడ్జి నుంచి కృష్ణానగర్ అంబేడ్కర్ విగ్రహం వరకు బ్రిడ్జి నిర్మిస్తే చాలామంది పేదలు ఇళ్లు కోల్పోతారు.

- ఎం. మహేందర్, కృష్ణానగర్

దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించాలి



అభివాదం చేస్తున్న తెలుగు సేన పార్టీ నేతలు సత్యారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కృష్ణాగౌడ్ తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా ప్రకటించి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని తెలుగు సేన పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.సత్యారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ పి.జగదీశ్వర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, జాతీయ కోశాధికారి నారాయణరెడ్డి, బీసీ విభాగం జాతీయ కన్వీనర్ జి.కృష్ణాగౌడ్ డిమాండ్ చేశారు. రెండో రాజధాని సాధనే లక్ష్యంగా ఈ నెల 12న ఇందిరాపార్కు వద్ద రిలే నిరాహారదీక్షలు, మార్చిలో చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి, జంతర్‌మంతర్ వద్ద దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 50 అసెంబ్లీ, 10 ఎంపీ స్థానాలకు, తెలంగాణలో 10 ఎంపీ స్థానాలకు పోటీ చేస్తుందన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ నటించిన ఉక్కు సత్యాగ్రహం సినిమాను మార్చి మొదటి వారంలో విడుదల చేస్తున్నామని, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ సినిమా రూపొందించామన్నారు.



మద్దెల శివకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు

'మద్దెలకు' జీవనసాఫల్య పురస్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సేవాతత్పరుడు మద్దెల శివకుమార్‌కు జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో నివేదిత ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సినీనటుడు, దర్శకుడు రావిపల్లి రాంబాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. మానవతావాది, అభ్యుదయ వాదిగా శివకుమార్ తన సేవలు విస్తరిస్తున్నారన్నారు. సుభాష్, దయానందరావు, దైవజ్ఞశర్మ, ఆమని, కిరణ్, అంబేడ్కర్ బాలకృష్ణ, భోగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గజేంద్ర మోక్షం హరికథ

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శంకరమఠంలో జరుగుతున్న హరికథా మహోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం భాగవతార్ ఎర్రా శ్రీనివాస్‌చే నిర్వహించిన గజేంద్రమోక్షం హరికథ ఆకట్టుకుంది. తబలా సుబ్బారావు, వయోలిన్‌పై శశిభూషణ్ హరికథకు వాయిద్య సహకారం అందించారు. దూరదర్శన్ కేంద్రం మాజీ డైరెక్టర్ డాక్టర్ పాలకూర్తి మధుసూదన్‌రావు, కేంద్ర సాహిత్య అకాడమి బాలపురస్కార గ్రహీత దాసరి వెంకటరమణ తదతరులు పాల్గొన్నారు.

'శోభన్‌బాబు గొప్పనటుడు'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శోభన్‌బాబు గొప్ప నటుడని, ఆయన నటించిన సినిమాలు నేటికీ ప్రజాదరణ పొందుతున్నాయని రాశి మూవీస్ అధినేత ఎం. నరసింహారావు అన్నారు. శోభన్‌బాబు నటించిన బావామరదళ్లు సినిమా విడుదలై శుక్రవారానికి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి సభ్యులు నరసింహారావును కలిసి అభినందనలు తెలిపారు. నరసింహారావు మాట్లాడుతూ.. బావామరదళ్లు సినిమా అనేక చోట్ల రికార్డు సృష్టించిందన్నారు. 18 కేంద్రాల్లో 100 రోజులు ఆడిందన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, పూడి శ్రీనివాస్, టి.సాయికామరాజు, యు. విజయ్, కుర్రా రాంబాబు తదితరులు నరసింహారావును కలిసిన వారిలో ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు సత్కారం

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణమఠం 50వ వార్షికోత్సవం నేపథ్యంలో ఆర్టీసీ ముషీరాబాద్ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు నూతన వస్త్రాలు, నగదు పారితోషికం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణమఠం అధ్యక్షుడు బోదమయానందస్వామి మాట్లాడుతూ.. మానవ సేవే మాధవసేవ అని, కండక్టర్లు, డ్రైవర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. డిపో మేనేజర్ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు శ్రీబోధమయానందస్వామికి పాదాభివందనం చేశారు.

చండీగఢ్ మేయర్ ఎన్నిక రద్దు చేయాలి : ఆప్

కవాడిగూడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చండీగఢ్ మేయర్ ఎన్నికను బీజేపీ లూటీ చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆప్, ఇండియా కూటమి ఓట్ల గల్లంతు, ప్రిసైడింగ్ అధికారి బ్యాలెట్ పేపర్లను ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. బీజేపీ ఒత్తిడితో అవకతవకలకు పాల్పడిన ప్రిసైడింగ్ అధికారిని అరెస్టు చేయాలని, మేయర్ ఎన్నిక రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'వడ్డెరుల సమస్యల పరిష్కారానికి కృషి'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వడ్డెరులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వడ్డెరుల ఆత్మగౌరవ భవనసముదాయ ట్రస్ట్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని శుక్రవారం కలిసి సమస్యలు వివరించి సన్మానించారు. వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య, డైరెక్టర్లు అంజయ్య, నాగరాజు, రాజు, అనంతరావు తదితరులు ఉన్నారు.

సంప్రదాయ వివాహాలే మేలు : మోడల్ సృజన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేలంటైన్ డే వద్దని.. సంప్రదాయ వివాహాలే మేలని ప్రముఖ మోడల్ సృజన అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలో వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హృదయ స్పందన కార్యక్రమ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ వివాహ సంప్రదాయం మహోన్నతమైందని తెలిపారు. వేలంటైన్ తరహా వివాహ వ్యవస్థ మనకు వద్దన్నారు. ఈనెల 12న హృదయ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మండలంలో 11 మందికి కల్యాణలక్ష్మి, 40 మందికి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శుక్రవారం పంపిణీ చేశారు. బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మ, తహసీల్దార్ భిక్షపతి పాల్గొన్నారు.

మందుల కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గోల్నాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మందుల కుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కుల సంఘం అధ్యక్షుడు సింగజోగి శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు ఒంటెద్దు రాములు, జల్లి ఎర్రయ్య, పోచాలు తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ సీనియర్ నాయకుడి కన్నుమూత



మధుగౌడ్ (ఫైల్)

ముషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు మధుగౌడ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్లు సుప్రియా నవీన్ గౌడ్, పావని వినయ్‌కుమార్, బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచి కుమార్, బీజేవైఎం నగర నాయకులు కుషాల్‌గౌడ్, అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు లింగం గుప్తా తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మధుగౌడ్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



నిర్మల

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుంతకల్ నుంచి నగరానికి వచ్చిన వృద్ధురాలు అదృశ్యమైంది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గుంతకల్‌కు చెందిన ఎస్.వినోద్ బోరబండ మోతీనగర్‌లో నివసిస్తున్నాడు. గుంతకల్ నుంచి తల్లి ఎస్.నిర్మల(60)ను తీసుకొని ప్యాసింజర్ రైలులో జనవరి 31వ తేదీ సాయంత్రం 5 గంటలకు కాచిగూడ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. తల్లిని ప్లాట్‌ఫారం ఒకటి వద్ద కూర్చోబెట్టి ఎంఎంటీఎస్ టికెట్ తీసుకురావడానికి అతడు వెళ్లాడు. వినోద్ కొద్ది సేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా తల్లి కనిపించలేదు. నిర్మల ఆచూకీ లభించకపోవడంతో కాచిగూడ రైల్వే పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా మరో రైలు ఎక్కి వెళ్లినట్లు ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.





మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

బిహార్ మాజీ ముఖ్యమంత్రి, నాయీ బ్రాహ్మణ సామాజికవర్గం నాయకుడు కర్పూరీ ఠాకూర్‌కు భారత రత్న అవార్డు ప్రకటించడాన్ని స్వాగతిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా సికింద్రాబాద్ జిల్లా కో-కన్వీనర్ సంగం బాలరాజ్, ముషీరాబాద్ నియోజకవర్గం నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాస్, ప్రవీణ్, కార్పొరేటర్ రచనశ్రీ, పూసరాజు, మాజీ కార్పొరేటర్ టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్/కవాడిగూడ, ఆంధ్రజ్యోతి

రేపు దివ్యాంగుల స్క్రీనింగ్ శిబిరం

నల్లకుంట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉదయ్‌పూర్‌కు చెందిన ఎన్జీవో నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 4న దివ్యాంగుల కోసం లింబ్, కాలిపర్స్ మెజర్‌మెంట్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ్ సేవా సంస్థాన్ సంస్థ ప్రతినిధులు భగవాన్ ప్రసాద్‌గౌర్, ప్రశాంత్ అగర్వాల్, నరేంద్రసింగ్ చౌహాన్ తదితరులు మాట్లాడారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కింగ్‌కోఠిలో ఈడెన్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైకల్య స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, వైకల్య ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలను శిబిరానికి హాజరయ్యే వారు తీసుకురావాలన్నారు. క్యాంపులో ఉచితంగా ఆహారం పంపిణీ చేస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. బాపూనగర్, శివాలయం ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, జిందాతిలిస్మాత్, పటేల్‌నగర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, సుందర్‌నగర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఛే నెంబర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాళ్లబస్తీ, గాంధీనగర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, గగన్‌మహల్, సిటీసెంట్రల్ లైబ్రరీ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు పేర్కొన్నారు.

మహ్మద్‌నగర్‌లో

కలుషిత నీటి సమస్య పరిష్కారం



యంత్రంతో సమస్యను పరిశీలిస్తున్న అధికారులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ మహ్మద్‌నగర్‌లో కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్ తాహా అన్నారు. శుక్రవారం బస్తీలో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు ఆధునిక యంత్రంతో పైపులైన్‌ను పరిశీలించారు. సమస్యను గుర్తించి పరిష్కరించారు. జలమండలి మేనేజర్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'కోదండరాం ఎమ్మెల్సీ కాకుండా కేసీఆర్ కుట్ర'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ సారథి ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ కాకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్ర చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆరోపించింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తదితరులు మాట్లాడారు. కోదండరాం పోరాటాల వల్లనే రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత గ్రహించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ విస్మరించిందన్నారు. కోదండరాంపై కుట్రలను బీఆర్ఎస్ విరమించుకోకపోతే బీఆర్ఎస్ భవన్‌ను వేలాదిమంది ఉద్యమకారులతో ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

వరంగల్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం

పోకల కిరణ్‌కుమార్ దరఖాస్తు

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోకల కిరణ్‌కుమార్ శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తానన్నారు. టికెట్ ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు కూడా దరఖాస్తు అందజేశానని ఆయన తెలిపారు.

నందరాజ్‌గౌడ్‌కు నివాళి

రాంనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నందరాజ్‌గౌడ్ సేవలు చిరస్మరణీయమని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి కొనియాడారు. మాజీ కార్పొరేటర్, బీజేవైఎం హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు నందరాజ్‌గౌడ్ 31వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బాగ్‌అంబర్‌పేటలో నందరాజ్‌గౌడ్ స్థూపానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు యాకర అమృత, కన్నె ఉమాదేవి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, బీజేవైఎం అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ సునీల్, అడప చంద్రమౌళి, నందరాజ్‌గౌడ్ కుమారుడు ఎం.రోహిత్‌గౌడ్, లలిత నందరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం అవసరం

● మందకృష్ణ మాదిగ

గోల్నాక, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం అవసరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా జాతీయ మెంబర్ పెరిక సురేష్ మందకృష్ణను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మందకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడిన వారికి తమ మద్దతు ఉంటుందన్నారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన పెరిక సామాజిక వర్గానికి ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పెరిక సామాజిక వర్గానికి చెందిన వారు, బీసీ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారు. సురేష్ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే ఎక్కడినుంచైనా పోటీ చేయడానికి సిద్ధమన్నారు.

అఖిల భారతీయ బంజారా సేవా సంఘ్

జాతీయ కార్యదర్శిగా రఘునాయక్ ఝుడావత్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ బంజారా సేవా సంఘ్ (ఏబీఎస్ఎస్) జాతీయ కార్యదర్శిగా రఘునాయక్ ఝుడావత్ నియమితులయ్యారు. నగరానికి వచ్చిన ఏబీఎస్ఎస్ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్ చేతుల మీదుగా ఆయనకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు.